సాక్షి వనపర్తి

మంగళవారం । 7 । మే । 2024



..సామాజిక విప్లవం

త్వరలోనే తెలంగాణలో సామాజిక విప్లవం రాబోతుందని అన్నామలై అన్నారు.

వివరాలు IIలో ▸



కొత్త పుంతలు..

రోజురోజుకూ ఎన్నికల ప్రచారం స్మార్ట్ ఫోన్ల రాకతో కొత్త పుంతలు తొక్కుతోంది.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
45.5 /27.9

వాతావరణం

ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు ఉక్కబోత ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమవుతుంది.

సమయం లేదు మిత్రమా..!

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఇంకా 5 రోజులే..

- ప్రచార రథాలు, సామాజిక మాధ్యమాలే కీలకం
- మండలాలు, గ్రామాలకు చేరని అభ్యర్థుల ప్రచారం
- కులపెద్దలతో రహస్య భేటీలు, హామీలు
- అన్ని పార్టీల్లో కొనసాగుతున్న చేరికల పర్వం



సాక్షి, నాగర్‌కర్నూల్‌: లోక్‌సభ ఎన్నికల సంగ్రామానికి సమయం దగ్గరపడుతున్న కొద్దీ లోక్‌సభ అభ్యర్థుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ఈ నెల 13న పోలింగ్‌ నిర్వహించనుండగా, 11న సాయంత్రం 5 గంటల వరకు ప్రచారం ముగియనుండటంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ఇంకా ఐదు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. మహబూబ్‌నగర్‌, నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గాల పరిధిలోని చాలావరకు మండలాలు, గ్రామాలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు చేరుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన సమయాన్ని వృథా చేయకుండా నాయకులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. పెద్ద పట్టణాలు, పెద్ద గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది ఓటర్లకు దగ్గరయ్యేందుకు ప్రచార రథాలు, సోషల్‌మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

■ ఎన్నికల్లో సామాజిక వర్గాల ఓట్లే కీలకంగా మారిన నేపథ్యంలో వారి మద్దతు కూడ గట్టుకునేందుకు కుల, మత పెద్దలతో అభ్యర్థులు, ముఖ్య నేతలు రహస్య భేటీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ఎక్కువ ఓట్లు ఉన్న సామాజిక వర్గాలపై దృష్టి సారించి వారిని కట్టుకునేందుకు ముందస్తు హామీలిస్తున్నారు. ఓ పక్క గెలుపు వ్యూహాలు రచిస్తూనే మరోపక్క ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలను తమ పార్టీల్లో చేర్పించుకుంటున్నారు.

మాటల తూటాలతో రాజకీయ వేడి..

మే నెల ప్రారంభం కావడంతో మండుతున్న ఎండలకు తోడు ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య మాటల తూటాలతో లోక్‌సభ ఎన్నికల వాతావరణం రణరంగంగా మారింది. ప్రత్యర్థులపై విమర్శలు, ప్రతి విమర్శలతో ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్‌ స్థానాల్లో రాజకీయ వాతావరణం రోజురోజుకీ వేడెక్కుతోంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఆరుసార్లు పర్యటించారు. అలాగే ఈనెల 11న ప్రచారానికి ఆఖరి రోజున సాయంత్రం 3 గంటలకు మక్తల్‌లో నిర్వహించే కాంగ్రెస్‌ జనజాతర సభకు మరోసారి హాజరుకానున్నారు. మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ లక్ష్యంగా ఆయన విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. బంగ్లా రాజకీయాలకు పాలమూరు ప్రజలు స్వస్తిపలకాలంటూ **ఆయన ప్రజలకు పిలుపునివ్వడం రాజకీయంగా వేడిని పుట్టించింది. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ సైతం తనదైన శైలిలో ప్రత్యర్థులపై విరుచుకుపడు**తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారు. ఉత్తరాఖండ్‌ సీఎం పుష్కర్‌సింగ్‌దామి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్‌ సంతోష్‌ డీకే అరుణకు మద్దతుగా నియోజకవర్గంలో పర్యటించారు. ఈ నెల 10వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ నారాయణపేటలో నిర్వహించనున్న బహిరంగసభకు హాజరు కానున్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి తరఫున గులాబీబాస్‌ కేసీఆర్‌ చేపట్టిన బస్సుయాత్ర ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గం పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌ పర్యటనలతో ఈ స్థానంలో ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్‌ అభ్యర్థి మల్లురవి తరఫున గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో నిర్వహించిన జనజాతర సభకు అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరయ్యారు. బీజేపీ సైతం తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నమలైని రంగంలోకి దింపి కల్వకుర్తిలో భారీ రోడ్‌షో నిర్వహించింది. మరో రెండు రోజుల్లో మరో జాతీయస్థాయి నేతతో ప్రచారం చేపట్టేందుకు సిద్ధమవుతోంది.



ప్రచార రథాలు, సామాజిక మాధ్యమాలే కేంద్రంగా..

ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారానికి నిప్పుల కుంపటిలా భగ్గుమంటున్న ఎండ ప్రతిబంధకంగా మారింది. మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉదయం 6 గంటలకే గ్రామాల్లోకి చేరి ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారు. 11 గంటల తర్వాత ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశాలతో గెలుపునకు తమ వ్యూహాలను పదునుపెడుతున్నారు. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టి రాత్రి 9 గంటల వరకు కొనసాగిస్తున్నారు. ఒక్కో పార్లమెంట్‌ నియోజకవర్గం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు వారి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలపై ఆయా నియోజకవర్గాల ప్రచార బాధ్యతలను అప్పగిస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధానంగా ప్రచార రథాలు, సోషల్‌ మీడియాపైనే అభ్యర్థులు ఎక్కువగా ఆధారపడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ప్రచార రథాల మైక్‌లతో పార్టీల ఎన్నికల ప్రచారం మార్మోగుతుండగా, సామాజిక మాధ్యమాల్లో మాటలు, తూటాలు, విమర్శనాస్త్రాలతో పార్టీలు తమ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఉండొద్దు

- రాష్ట్ర ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



పాన్‌గల్‌ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

పాన్‌గల్‌: ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని, సేకరణలో జాప్యం చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. 14 శాతం తేమ ఉన్నా.. కొనుగోలు చేయాలన్నారు.

జాప్యంపై రైతుల ఆగ్రహం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండలంలోని రేమద్దులలోని కొనుగోలు కేంద్రం వద్ద రైతులు, హమాలీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కేంద్రాలకు వచ్చిన ధాన్యం తూకం చేయడంలో హమాలీలు పక్షపాతం చూపుతున్నారని అన్నారు. ముందు వచ్చిన ధాన్యం తూకం చేయకుండా, వెనుకాల వచ్చిన ధాన్యం తూకం చేయడంపై వాగ్వాదం చోటుచేసుకుంది. ఇలాంటి చర్యలతో 15 రోజులుగా కేంద్రంలోనే పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పోలీస్‌ ప్రజావాణికి ఐదు అర్జీలు

వనపర్తి: జిల్లా పోలీస్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ రక్షితా కె.మూర్తి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని పరిష్కారం కోసం సంబంధిత పోలీస్‌ అధికారులకు అర్జీలను సిఫారసు చేశారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం భోజన విరామం వరకు నిర్వహించిన ప్రజావాణికి మొత్తం ఐదు అర్జీలు దాఖలయ్యాయి. అందులో భూమికి సంబంధించిన అర్జీలు 03, పరస్పర గొడవలు, భార్యాభర్తల ఘర్షణలకు సంబంధించి ఒక్కొక్క అర్జీ సమర్పించినట్లు ఎస్పీ వెల్లడించారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పండి

- ఖిల్లాఘనపురంలో గిరిజన ఆత్మీయ సమ్మేళనం



ఖిల్లాఘనపురంలో నిర్వహించిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ అభ్యర్థి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన గిరిజన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ నాయకులకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి రావడం అలవాటుగా మారిందన్నారు. సీమాంధ్ర నాయకులతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి చేసేందుకు కేసీఆర్‌ నిరంతరం కృషి చేశారన్నారు. ఆయన హయాంలోనే మన ప్రాంతంలో 11 నెలల సమయంలోనే కాల్వలు తవ్వి గ్రామాల్లోని చెరువులు, వాగుల వెంట సాగునీరు పారించారన్నారు. ఆడపడుచుల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో 'లక్షా పదహార్లు అందించారన్నారు. రైతులకు ప్రతి పంటకు ఎకరానికి రూ.5 వేల చొప్పున సంవత్సరానికి రూ.10 వేలు అందిస్తే.. నేడు రైతుబంధు అడిగిన రైతులను చెప్పుతో కొట్టాలని కాంగ్రెస్‌ పెద్దలు అంటున్నారని తెలియజేశారు. రైతులు ఏ కారణంతో చనిపోయినా.. దినవారాల వరకు రూ.5 లక్షలు అందించిన ఘనత కేసీఆర్‌ దేనని చెప్పారు. కాంగ్రెస్‌ నాయకులు.. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఒకటికాదు, రెండు కాదు 420 హామీలు ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు ఆరు గ్యారంటీలు అమలుకు దిక్కులేదన్నారు. ఒక్క ఉచిత బస్సు తప్పా.. ఏదీ అందడం లేదన్నారు. అలాంటి మోసగాళ్లకు ఇప్పుడు మళ్లీ ఓటు వేసి మోసపోవద్దన్నారు. ఎంపీపీ కృష్ణానాయక్‌, జెడ్పీటీసీ సభ్యులు సామ్యానాయక్‌, రాళ్లకృష్ణయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గిరిజనులు

న్యూస్‌రీల్‌


రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం..

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



పెబ్బేరు రూరల్‌: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టు 15 లోపు చేసి తీరుతామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఆయన వనపర్తి మండలంలోని మెంటపల్లి, దత్తాయిపల్లి గ్రామాల్లో పాల్గొని ప్రచారం నిర్వహిస్తూ.. మాట్లాడారు. నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ అభ్యర్థి మల్లు రవి హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌ పార్టీ అమలు చేస్తున్న 6 గ్యారంటీల్లో 5 ఇప్పటికే అమలు చేస్తున్నామని, ఉచితబస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల వరకు పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. కడుకుంట్లకు చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు కోళ్ల వెంకటేష్‌, చెన్నరాములు, రవితో పాటు కొంత మంది జిల్లెల చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

'విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉండొద్దు'



వనపర్తిటౌన్‌: ఎండ తీవ్రత అధికంగా ఉందని, ఇలాంటి సమయంలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ డి.రంగనాథరాయ్‌ అన్నారు. నిరంతర విద్యుత్‌ సరఫరాపై చైర్మన్‌ కం మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి సర్కిల్‌ కార్యాలయంలో సమావేశమై, ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగకుండా మండల స్థాయిలో 15 ప్రత్యేక బృందాలను, డీఈ హోదాలో 2 సబ్‌డివిజన్‌ పరిధిలు, వనపర్తి, కొత్తకోట సబ్‌ డివిజన్‌కు ఇద్దరు చొప్పున డీఈలను నియమించినట్లు చెప్పారు. 24 గంటలు నిరంతరాయం లేకుండా పర్యవేక్షణ చేస్తూ.. కింది స్థాయి సిబ్బందికి సరైన సూచనలు ఇవ్వాలని, నిరంతర విద్యుత్‌ సరఫరా జరిగేలా కృషి చేయాలన్నారు. రెండు ప్రత్యేక కంట్రోల్‌ రూంలు ఏర్పాటు చేశామని చెప్పారు. డివిజన్‌ కార్యాలయం కంట్రోల్‌ రూం నంబర్‌ 7382605903, సర్కిల్‌ కార్యాలయం కంట్రోల్‌ రూం నంబర్‌ 7382614830 అని పేర్కొన్నారు. సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ పీవీ నాగేంద్రకుమార్‌, డీఈలు పాల్గొన్నారు.

ప్రిసైడింగ్‌ అధికారులదే కీలకపాత్ర



పీఓలు, ఏపీఓలకు సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి తేజస్‌ నందలాల్‌ పవార్‌

- జిల్లా ఎన్నికల అధికారి తేజస్‌ నందలాల్‌ పవార్‌

వనపర్తి: పోలింగ్‌ నిర్వహణలో ప్రిసైడింగ్‌ అధికారులదే కీలక పాత్ర అని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకూడదని జిల్లా ఎన్నికల అధికారి తేజస్‌ పవార్‌ సూచించారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పోలింగ్‌ కేంద్రాలకు కేటాయించిన పీఓలు, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల పనితీరుపై సోమవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. శిక్షణ తీసుకుంటున్న 389 మంది పీఓ, ఏపీఓలను కలిసి ఎన్నికల నిబంధనలపై పలు సూచనలు చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందు ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల నిర్వహణ అధికారులు దృష్టిలో ఉంచుకుని పోలింగ్‌ రోజున విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్‌స్టేషన్లో అడుగు పెట్టిన తర్వాత అక్కడి పరిస్థితులను అదుపులో ఉంచుకునే బాధ్యత పీఓ, ఏపీఓలపై ఉంటుందన్నారు. ఈవీఎంల నిర్వహణలోగాని, వివిధ రకాల ఫారాలు నింపడంలోగాని మరేదైన చిన్న అనుమానం వచ్చినా.. మాస్టర్‌ ట్రైనర్లతో అడిగి తెలుసుకోవాలని, పీఓలు ఎన్నికల డైరీని చదివి ఆకలింపు చేసుకోవాలన్నారు. పోలింగ్‌ రోజున ఏ చిన్న పొరపాటు దొర్లడానికి వీలులేదని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గంలో ఈ సారి లోక్‌సభ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున రెండు బ్యాలెట్‌ యూనిట్లు ఉంటాయని, ఈవీఎంను ఎలా అనుసంధానం చేయాలో ఒకటికి రెండు సార్లు శిక్షణ సమయంలోనే సరిచూసుకోవాలన్నారు.

పోలింగ్‌ స్టేషన్ల పరిశీలన

కొత్తకోట రూరల్‌: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు తైవాంగ్‌ గయాకో భూటియా ఐఏఎస్‌, 11–పీసీ మహబూబ్‌నగర్‌ వారు సోమవారం కొత్తకోట మండలంలోని పాలెం జెడ్పీహెచ్‌ఎస్‌, ప్రాథమిక పాఠశాల, అదేవిధంగా కొత్తకోట పట్టణ కేంద్రంలోని బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్‌ కేంద్రాల్లో ఓటర్ల కోసం అధికారులు ఏర్పాటు చేసిన ర్యాంప్‌లు, వాష్‌రూంలు, ప్యాన్స్‌, లైట్స్‌, డోర్‌ ఏఎస్‌ఎఫ్‌ కిటికీలు వంటి వాటిని ఎన్నికల అధికారులు పరిశీలించారు. ఓటర్లకు ఓటరు స్లిప్‌ల పంపిణీ పూర్తి చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. వీరి వెంట తహసీల్దార్‌ బాల్‌రెడ్డి, యంఆర్‌ఐ వాసు, ఎంపీఓ రవీందర్‌ బాబు, పంచాయతీ రాజ్‌ ఏఈ హుస్సేన్‌, మున్సిపల్‌ కమిషనర్‌ తదితరులు ఉన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ హైస్కూల్‌ 255, 256, 257, 258 పోలింగ్‌ కేంద్రాలను ఎలక్షన్‌ జనరల్‌ పరిశీలకులు తైవాంగ్‌ గయాకో భూటియా ఐఏఎస్‌ సోమవారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. పోలింగ్‌ కేంద్రాల్లో మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ర్యాంప్‌, వెంటిలేటర్‌, తాగునీరు, వాష్‌రూం, టాయిలెట్స్‌ పోలింగ్‌ చిట్టీల డిస్ట్రిబ్యూషన్‌ తదితర అంశాలను అధికారులతో ఆయన ఆరాతీశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ అబ్రహం లింకన్‌, సెక్టోరల్‌ ఆఫీసర్‌ కృష్ణయ్య, నరేష్‌, ఆర్‌ఐ రాజేశ్వరీ, బీఎల్‌ఓలు శారద, రజిత, పుష్పా, అరుణ పాల్గొన్నారు.



మదనాపురంలో పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు

రేవంత్‌ దుకాణం బంద్‌ కావాలి

- హామీల అమలులో కాంగ్రెస్‌ విఫలం
- కేంద్రంలో మూడోసారి బీజేపీదే అధికారం
- ప్రతిఒక్కరు మోదీకి మద్దతుగా నిలవాలి
- ఉత్తరాఖండ్‌ సీఎం పుష్కర్‌సింగ్‌ ధామి



మాట్లాడుతున్న ఉత్తరాఖండ్‌ సీఎం పుష్కర్‌సింగ్‌ ధామి, చిత్రంలో డీకే అరుణ తదితరులు

పాలమూరు: 'తెలంగాణలో మోసపూరిత తెలంగాణలో ఆరు గ్యారంటీల పేరుతో మోసపూరితంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఉత్తరాఖండ్‌ ముఖ్యమంత్రి పుష్కర్‌ సింగ్‌ ధామి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని ఓ గార్డెన్‌లో సోమవారం రాత్రి బీజేపీ పాలమూరు శాఖ నిర్వహించిన మేధావుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని, మహిళలకు అకౌంట్‌లో రూ.2,500లు వేస్తామని చెప్పి మరిచిపోయారన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, రైతుల రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని ఎద్దేవా చేశారు. మన దేశం, మన పిల్లల భవిష్యత్‌ కోసం ఈ ఎన్నికలు అని, ఈ విషయాన్ని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. పాలమూరు ఓటర్లు మోదీకి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 10న ఉత్తరాఖండ్‌లో చార్‌ధమ్‌ యాత్ర ప్రారంభమవుతుందని, మీరందరూ వచ్చి భగవంతుని ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

ప్రతిచోటా బీజేపీ ఆదరణ

దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందని పుష్కర్‌సింగ్‌ ధామి అన్నారు. తెలంగాణలోని మహబూబాబాద్‌, సికింద్రబాద్‌తోపాటు గతంలో వరంగల్‌, నిజామాబాద్‌లో వెళ్లానని ప్రతిచోట ప్రజల నుంచి బీజేపీకి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. తెలంగాణతోపాటు దేశ ప్రజలందరూ మోదీ మళ్లీ ప్రధాని కావాలని కోరుకుంటున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. మోదీ నేతృత్వంలో ప్రపంచంలోనే భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. 2014 కంటే ముందు ప్రపంచంలో భారత్‌ అవినీతిమయమైన దేశంగా చర్చించుకునేవారని, కానీ, ఇప్పుడు మోదీ హయాంలో రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా దేశ ప్రజలను ప్రత్యేక గౌరవంతో చూస్తున్నారన్నారు. మోదీ హయాంలోనే రక్షణ రంగం బలోపేతమైందని, మన సైనికులు సరిహద్దులు దాటి శత్రువులకు తగిన బుద్ధి చెబుతుండటం గర్వకారణం అన్నారు. అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ట జరిగిందని, సీఏఏ చట్టాన్ని తీసుకురావడంతోపాటు నిరుపేదల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఒకపక్క మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి పనిచేస్తుంటే.. మరోపక్క కాంగ్రెస్‌, విపక్షాలు స్వార్థ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ అభ్యర్థి డీకే అరుణకు రాజకీయంలో అపార అనుభవం ఉందని, ఎంపీగా ఆమెను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు డోకూర్‌ పవన్‌ కుమార్‌రెడ్డి, కె.రాములు, శ్రీవర్ధన్‌రెడ్డి, అనంతరెడ్డి, డాక్టర్‌ రాంమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

నోటాకు చోటు

- అభ్యర్థులు నచ్చకపోతే ఈ గుర్తుకు ఓటు వేసేందుకు అవకాశం
- 2014లో సుప్రీంకోర్టు సూచనతో ప్రవేశపెట్టిన ఎన్నికల సంఘం



పాలమూరు: రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం ఓటుహక్కు. ఓటరు తనకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునేందుకు దీన్ని వినియోగిస్తారు. ఒకవేళ పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నోటా (నన్‌ ఆఫ్‌ ద అబోవ్‌)ను సంధించొచ్చు. ఈ హక్కును 2014లో సుప్రీంకోర్టు ఓటర్లకు కల్పించింది. బ్యాలెట్‌పై అభ్యర్థుల జాబితాలో ఈ గుర్తు ఉంటుంది. ఇది చాలాసార్లు గెలుపోటములను తలకిందులు చేసింది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో..

ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాలో ఉన్న 14 నియోజకవర్గాల్లో 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు చాలా వరకు నోటా వైపు వెళ్లారు. ప్రతి నియోజకవర్గంలో దాదాపు వెయ్యి మంది ఓటర్లు నోటాకు మద్దతు ఇచ్చారు. అత్యధికంగా అచ్చంపేటలో 2,833 మంది నోటాకు ఓటు వేశారు. అత్యల్పంగా కల్వకుర్తిలో 661 మంది నోటాకు ఓటు వేయడం జరిగింది.

లోక్‌సభ	ఏడాది	పోలైన ఓట్లు	నోటాకు వచ్చినవి	శాతం
మహబూబ్‌నగర్‌	2014	10,14,800	9,037	0.89
మహబూబ్‌నగర్‌	2019	9,84,767	10,600	1.08
నాగర్‌కర్నూల్‌	2014	11,16,159	12,388	1.11
నాగర్‌కర్నూల్‌	2019	9,89,893	13,525	1.37

అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	నోటాకు పోలైన ఓట్లు	నియోజకవర్గం	నోటాకు పోలైన ఓట్లు
అచ్చంపేట	2,833	నారాయణపేట	1,517
అలంపూర్‌	2,013	షాద్‌నగర్‌	1,389
కొడంగల్‌	2,002	మహబూబ్‌నగర్‌	1,157
వనపర్తి	1,938	నాగర్‌కర్నూల్‌	1,122
మక్తల్‌	1,896	కొల్లాపూర్‌	1,037
దేవరకద్ర	1,706	గద్వాల	775
జడ్చర్ల	1,655	కల్వకుర్తి	661

బీఆర్‌ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌ గూటికి చేరిన రాష్ట్ర ట్రేడ్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ దేవరి మల్లప్ప



కాంగ్రెస్‌ పార్టీలో చేరిన దేవరి మల్లప్పతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి

మక్తల్‌: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్‌ తగిలింది. రాష్ట్ర ట్రేడ్‌ ప్రమోషన్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌, ఉద్యమ నేత దేవరి మల్లప్ప కాంగ్రెస్‌ గూటికి చేరారు. సోమవారం మక్తల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి సమక్షంలో దేవరి మల్లప్పతో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా మల్లప్ప మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో దాదాపు 20 ఏళ్లపాటు పనిచేశానని.. మక్తల్‌ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్‌ ఇస్తానని కేసీఆర్‌ చెప్పి మోసం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీకేఆర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ బాలకిష్టారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, గట్టు తిమ్మప్ప, బాద్మి శివకుమార్‌, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చెన్నయ్యసాగర్‌, రవికుమార్‌, గణేష్‌కుమార్‌ పాల్గొన్నారు.

కొత్త పుంతలు..

అరచేతి ప్రచారంపై అభ్యర్థుల మొగ్గు

- జోరుగా ఫేస్‌బుక్‌, వాట్సాప్‌, యూట్యూబ్‌లలో ప్రచారం
- ఖర్చు తక్కువ..చేరేది ఎక్కువ



సాక్షి తెలంగాణ ఎలక్షన్‌ 2024

అచ్చంపేట: ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. బరిలో నిలిచిన అభ్యర్థులు, నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. స్మార్ట్‌ఫోన్‌ల రాకతో ప్రపంచం చాలా మారింది. వేలితో టచ్‌ చేస్తే చాలు.. చిట్టి తెరపై సర్వం ప్రత్యక్షం అవుతున్నాయి. పరిస్థితులు బట్టి రంగులు మార్చే మనం రాజకీయాల్లోనూ స్మార్ట్‌ మార్పు కనిపిస్తోంది. జనం చూపు ఎక్కడ ఉంటుందో.. అక్కడే నాయకులు తమ ప్రచారాన్ని పెంచుకుంటున్నారు. వాల్‌రైటింగ్స్‌, కరపత్రాలు, బ్యానర్ల బదులు సోషల్‌మీడియాను ప్రచార వేదికగా మార్చుకుంటున్నారు. కొంత మంది వృద్ధులు, పేదలు మినహాయిస్తే.. ఓటు హక్కు ఉన్న చాలా మంది చేతిలో ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్‌ ఉంది. అధిక సంఖ్యలో ఉన్న యువ, మధ్య వయస్సులైన ఓటర్లందరూ సోషల్‌ మీడియాను ఫాలో అవుతుఉన్నవారే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు ఇప్పటికే విడివిడిగా గ్రూపులు ఏర్పాటు చేసిన తమ అభ్యర్థిత్వం, పార్టీ విధానాలపై పోస్టులు పెడుతూ ఓటర్లను ఆకర్శించే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో ఎన్నికలు వస్తున్నాయంటే పల్లెల్లో, పట్టణాల్లో తెల్లగా ఉండే గోడలు రాతలతో నిండిపోయేవి. ఇప్పుడు ఎన్నికల సంఘం నిబంధనలతో చాలా మేర తగ్గింది.

హద్దులు దాటొద్దు..

ప్రత్యేకంగా ఐటీ విభాగాలను, సోషల్‌ మీడియా ఇన్‌చార్జిలను నియమించుకుని ప్రచారం చేయిస్తున్నారు. ఒక సోషల్‌ మీడియాలో విస్తృతంగా ప్రచారం పెరగడం, ఒక్కోసారి హద్దులూ దాటకుండటంతో ఎన్నికల సంఘం వీటిపైనా నిఘా పెట్టింది. ఇందులోను హద్దులు దాటితే కేసులు నమోదు చేస్తుండటం గమనార్హం.

ఫలితం ఎక్కువే..

ఒకప్పుడు వాల్‌రైటింగ్‌ రాయాలంటే ఆర్టిస్ట్‌ కావాలి. ఇంటి యాజమాని అనుమతి తీసుకోవాలి. ఇలా ఇబ్బందులు పడేవారు. ఎన్నికల సందర్భంగా అభ్యర్థికి అయ్యే ఖర్చులో భాగంగా వాల్‌రైటింగ్‌, పోస్టర్లు, బ్యానర్లను ఎన్నికల సంఘం వారు లెక్కించేవారు. దీంతో అభ్యర్థి తను ఎన్నికల్లో ఖర్చుపెట్టిన డబ్బులు కాకుండా ఇవి అదనంగా ఉండేవి. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్‌ ఏజెన్సీ ద్వారా సోషల్‌ మీడియా కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసుకున్నారు. అభ్యర్థికి చెందిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోస్టులు చేస్తున్నారు. నియోజకవర్గస్థాయి నుంచి బూత్‌స్థాయి వరకు బాధ్యులను నియమించి వారి ద్వారా సమాచారాన్ని ఓటర్లకు చేరవేస్తున్నారు.

ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్‌ కనుమరుగు



బుసిరెడ్డిపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్‌: పార్లమెంట్‌ ఎన్నికల తరువాత బీఆర్‌ఎస్‌ కనుమరుగవుతుందని జూపల్లి అన్నారు. మండలంలోని బుసిరెడ్డిపల్లిలో మండల ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. బూత్‌ కమిటీలు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి బూత్‌ కమిటీ సభ్యులు పది గృహాలను సందర్శించి కాంగ్రెస్‌ పార్టీ చేసే సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఓట్లు సాధించాలన్నారు. ఎన్నికల అనంతరం పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందిస్తామన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయనే విషయాన్ని గమనించాలన్నారు.

బీఆర్‌ఎస్‌, బీజేపీలకు గుణపాఠం..

గిరిజనులను మోసం చేసిన బీఆర్‌ఎస్‌, బీజేపీలకు ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెబుతూ.. కాంగ్రెస్‌ పార్టీని గెలిపించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో సీపీఎం నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్‌ గాంధీ రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి డా.మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీలను తప్పక అమలు చేస్తుందన్నారు. వెంకటేష్‌నాయుడు, రవికుమార్‌, మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్‌సాగర్‌, రాముయాదవ్‌, ఉస్మాన్‌, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బోగస్‌ హామీలతో కాంగ్రెస్‌ గెలుపు



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌ న్యూటౌన్‌/మరికల్‌/ కోయిల్‌కొండ: రాష్ట్రంలో బోగస్‌ హామీలతో కాంగ్రెస్‌ పార్టీ గెలుపొంది అధికారంలోకి వచ్చిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మరికల్‌లో నిర్వహించిన కార్నర్‌ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఎక్కడ అమలయ్యాయని ప్రశ్నించారు. మరోసారి దగా కోరు కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని కోరారు. మరోపక్క బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌ పార్టీని భూస్థాపితం చేసేందుకు కుట్ర చేస్తున్నారని, తెలంగాణ సాధించిన కేసీఆర్‌ స్థాపించిన పార్టీని బతికిచ్చుకుంటారో.. చప్పుకుంటారో మీ చేతుల్లోనే ఉందన్నారు. రాబోయే పార్లమెంట్‌ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కోయిలకొండలో నిర్వహించిన ప్రచారంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలనలో విఫలమయ్యాయన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్‌ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. అలాంటి పార్టీకి పార్లమెంట్‌ ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధిచెప్పాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ సురేఖ, సింగిల్‌ విండో చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు సంపత్‌, తిరుపతయ్య, హన్మిరెడ్డి, కృష్ణారెడ్డి, శమీం, విద్యాసాగర్‌, రాజ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మార్నింగ్‌ వాక్‌

జిల్లాకేంద్రంలోని క్రీడా మైదానం, బాలుర కళాశాల మైదానంలో మార్నింగ్‌ వాకర్స్‌తో కలిసి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మార్నింగ్‌ వాక్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మైదానాల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని వాకర్స్‌ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.

గో బ్యాక్‌ గువ్వల

- మాజీ ఎమ్మెల్యేను అడ్డుకున్న నక్కలగండి భూ నిర్వాసితులు



గువ్వల ప్రసంగాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

అచ్చంపేట రూరల్‌: ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నక్కల గండి ప్రాజెక్టు నిర్మాణం పేరుతో ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ ఇప్పించకుండా జాప్యం చేశావని, ఏ ముఖం పెట్టుకుని గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వచ్చావని అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి గ్రామ ప్రజలు, భూ నిర్వాసితులు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును అడ్డుకున్నారు. సోమవారం అచ్చంపేట మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ తరఫున ప్రచారానికి వెళ్లిన గువ్వల బాలరాజుకు చేదు అనుభవం ఎదురైంది. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమను పట్టించుకోలేదని, హామీలను నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌ ఎన్నికలు ఉండటంతో మరోసారి మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాడని ఆరోపిస్తూ.. గో బ్యాక్‌ గువ్వల అంటూ నినాదాలు చేశారు. గువ్వల ప్రసంగిస్తుండగా.. అడ్డుకోవడానికి ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న సిద్దాపూర్‌ పోలీసులు వారిని నిలువరించారు.

కాంగ్రెస్‌పై నమ్మకం లేదు..

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం.. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం లేదని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం అచ్చంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ తరఫున ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్‌, తనపై పెరుగుతున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్‌ నాయకులు తనను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. రౌడీ, గుండా రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ నర్సింహగౌడ్‌, నాయకులు రాజిరెడ్డి, బోడ్య నాయక్‌, వంశీనాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీని గెలిపించండి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌. ప్రవీణ్‌కుమార్‌

- బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌. ప్రవీణ్‌కుమార్‌

వనపర్తి: అధికారం, పదవుల కోసం అబద్ధాలు చెప్పే బీజేపీ, కాంగ్రెస్‌ను నమ్మకుండా, నిజాయితీని గెలిపించాలని నాగర్‌కర్నూల్‌ బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌. ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో మాదిగల రాజకీయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదిగల ఆత్మగౌరవ సభకు ఆయన హాజరై ప్రసంగించారు. తనను ఎంపీగా గెలిపిస్తే.. తెలంగాణ గురుకులాల ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేసినట్లుగా నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గం అభివృద్ధిని దేశానికే ఆదర్శంగా చేసి చూపిస్తానన్నారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తే అభివృద్ధి అధోగతి పాలవుతుందన్నారు.

కాంగ్రెస్‌, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

కోడేరు: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌, బీజేపీల మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ కోరారు. సోమవారం కోడేరు మండల కేంద్రంలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించి స్థానిక బస్టాండ్‌ వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎంపీగా గెలిపిస్తే ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. రైతులను నమ్మించి మోసం చేసి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ హయాంలో వడ్లను గిట్టుబాటు ధరలకు కొన్నాం. ఈ ప్రభుత్వం 500 బోనస్‌తో రూ.2500కు వడ్లను కొంటామన్న రేవంత్‌ ఇప్పుడు రైతులు రూ. 1,800 అమ్ముకుంటుంటే ఏం చేస్తున్నాడని విమర్శించారు. రైతుబంధు రాక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం గురించి బీఆర్‌ఎస్‌ పార్టీ ఒక్కటే ఆలోచన చేసిందని, ఈ ఎన్నికల్లో రెండు పార్టీలకు తగ్గిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

స్థానికేతరుడిని ఓడించాలి: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న స్థానికేతరుడు, కాంగ్రెస్‌ అభ్యర్థి మల్లురవిని ఓడించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్‌, మంగి విజయ్‌, గోవర్ధన్‌, గిద్దె రామనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో సామాజిక విప్లవం



కల్వకుర్తిలో మాట్లాడుతున్న తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై

కల్వకుర్తి/ కల్వకుర్తి రూరల్‌: దేశం అన్నిరంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలంటే మరోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టాల్సిన అవసరం ఉందని బీజేపీ తమిళనాడు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై అన్నారు. సోమవారం రాత్రి నాగర్‌కర్నూల్‌ జిల్లా కల్వకుర్తిలో నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ బీజేపీ అభ్యర్థి భరత్‌ ప్రసాద్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో సామాజిక విప్లవం రాబోతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత పాలకుల మాదిరిగా కాకుండా దేశం మొత్తం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలోని 112 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థి అని ఆ కూటమి నాయకులే చెప్పలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. అన్నింటిలో ఓడిపోయిన రాహుల్‌గాంధీ నియోజకవర్గం మార్చుకున్నారని, ఇది నాయకత్వ లక్షణం కాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారని ఎన్నికల తర్వాత ముదిరాజ్‌ మాటలు కావాలి అంటారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అబద్ధపు హామీలతో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని దుయ్యబట్టారు.

కాంగ్రెస్‌ను నమ్మితే అంతే

మరోసారి కాంగ్రెస్‌ పార్టీని నమ్మి ఓటేస్తే ముంచేస్తుందని ఎంపీ అభ్యర్థి భరత్‌ ప్రసాద్‌, పార్టీ రాష్ట్ర నాయకుడు ఆచారి అన్నారు. బీజేపీ గెలుపు ఖాయం అని తెలడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధపు వీడియోలతో అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో రిజర్వేషన్ల రద్దు జరగకపోవడంతోపాటు అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్‌ కల్పించిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. రాజ్యాంగాన్ని మార్చబోమని, రిజర్వేషన్లు రద్దు కావని మరోసారి మోదీ ప్రధాని కావడానికి బీజేపీకి అండగా నిలవాలని కోరారు. ఆరు గ్యారంటీలు అమలు చెయ్యకపోతే రేవంత్‌రెడ్డికి ప్రజలు గుణపాఠం చెపుతారని భరత్‌ప్రసాద్‌, ఆచారీలు అన్నారు. రోడ్‌షోకు విశేషణ స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ తరాల అభ్యున్నతికి పట్టం కట్టండి

- మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



కిష్టాపూర్‌తో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌ రూరల్‌/ధన్వాడ: ప్రజాసంక్షేమానికి అహర్నిశలు పాటుపడే కాంగ్రెస్‌ పార్టీకి ఓటువేసి, భవిష్యత్‌ తరాల అభ్యున్నతికి పట్టం కట్టాలని మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కోరారు. సోమవారం మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీలోని చిన్నదర్‌పల్లిలో ఇంటింటి ప్రచారం.. ధన్వాడ, హన్మాన్‌పల్లి, కొండాపూర్‌, కిష్టాపూర్‌, రామకిష్టాయిపల్లి గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు మంజూరు చేయడంతో పాటు ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. కొడంగల్‌ – నారాయణపేట ఎత్తిపోతల పథకంతో రైతాంగానికి సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని అన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఎన్నికల సందర్భంగా కల్లబొల్లి మాటలు చెప్పే బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకులను నమ్మి మోసపోవద్దని కోరారు. ధన్వాడ మండలం నుంచి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కంటే ఎక్కువ మెజార్టీ రావాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రామచంద్రానాయక్‌, నరేష్‌, రమేష్‌నాయక్‌, రవి, శ్రీనివాస్‌ గోపాల్‌రెడ్డి ఆర్‌.వెంకట్‌రెడ్డి, రహీం, భగవంత్‌, కేశవులు, ఖాదర్‌ పాల్గొన్నారు.

నగదు పట్టివేత



నందిన్నె చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో పోలీసులు

మహబూబ్‌నగర్‌ క్రైం/కేటీదొడ్డి: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. మహబూబ్‌నగర్‌ టూటౌన్‌ పోలీసులు సోమవారం మహబూబ్‌ అలీఖాన్‌ అనే వ్యక్తి నుంచి రూ.లక్ష 30వేల నగదు స్వాధీనం చేసుకొని సీజ్‌ చేసినట్లు సీఐ డి.స్వామిగౌడ్‌ తెలిపారు. బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 44.8 లీటర్ల మద్యం పట్టుకుని సీజ్‌ చేశారు.

❑ కేటీదొడ్డి మండలం నందిన్నె చెక్‌పోస్టు వద్ద రూ. 2 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ శ్రీనివాస్‌ తెలిపారు. రాయిచూర్‌ జిల్లా యాపల్‌దిన్నె మండలం ఎర్రగుంట నుంచి రంగప్ప అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తుండగా.. పట్టుకొని జిల్లా గ్రీవెన్స్‌ సెల్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎస్‌ఎస్‌టీం హేమంత్‌రెడ్డి, ఏఎస్‌ఐ మహేష్‌, సిబ్బంది గోపాల్‌నాయక్‌, జగదీష్‌, వస్రాంనాయక్‌ ఉన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే రిజర్వేషన్లపై రాద్ధాంతం



నారాయణపేటలో మాట్లాడుతున్న బీఎల్‌ సంతోష్‌

- కార్యకర్తలు ధీటుగా తిప్పికొట్టాలి
- తెలంగాణలో కాంగ్రెస్‌, బీజేపీల మధ్యే పోటీ
- బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్‌ సంతోష్‌

పాలమూరు/నారాయణపేట: ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చుకోలేని కాంగ్రెస్‌ పార్టీ.. ప్రజల దృష్టిని మరల్చేందుకే రిజర్వేషన్లపై అనవసర రాద్ధాంతం చేస్తోందని బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్‌ సంతోష్‌ ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్‌, నారాయణపేట జిల్లా కేంద్రాల్లో సోమవారం నియోజకవర్గ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, జిల్లా స్థాయి బూత్‌ కమిటీలతో ముఖాముఖి నిర్వహించారు. పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో పార్టీ సంస్థాగతంగా చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్‌ పార్టీ అవలంబిస్తున్న విధానాలను బీజేపీ కార్యకర్తలు ధీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్‌, బీజేపీల మధ్యే పోటీ ఉంటుందన్నారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని అన్నారు. ఈసారి ఏపీలో కూడా ఖాతా తెరుస్తామన్నారు. పార్టీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. దేశ ప్రజల సంక్షేమానికి ప్రధాని మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రధానిగా మోదీ ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. రాహుల్‌ గాంధీ ప్రధాని అవుతాడని రేవంత్‌రెడ్డి చెబితే ఎవరైనా నమ్ముతారా అని అన్నారు. దేశంలో అంతర్భాగం అయిన కశ్మీర్‌ అభివృద్ధికి ఆర్టికల్‌ 370ని రద్దుచేసినట్లు తెలిపారు. ధనిక వర్గాల్లో వెనుకబడిన వారికి ఈబీసీ రిజర్వేషన్‌ కల్పించడం జరిగిందన్నారు. గ్రామీణ స్థాయిలో ఉన్న బీజేపీ వేవ్‌తో పాటు ఓటు బ్యాంకును కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కర్ణాటక ఎంపీ ముని స్వామి, ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, పద్మజారెడ్డి, డోకూర్‌ పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పగడాకుల శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ, బంగారు శృతి, రతంగ్‌ పాండురెడ్డి, కొండయ్య, సుధాకర్‌, బాల్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సత్యయాదవ్‌, రఘు రామయ్యగౌడ్‌ పాల్గొన్నారు.

ఓటు పుట్టుక - నేపథ్యం



అచ్చంపేట: ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగం ఎన్నుకున్న విధానం ఓటు. ఏ భాషలో అయినా అభ్యర్థులను ఎన్నుకోవడాన్ని ఓటు అని పిలుస్తారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటు, ఓటర్లు పదాలు తరుచూ వినిపిస్తున్నాయి. కానీ చాలా మందికి ఓటు అనే పదానికి అర్థం తెలియదు. ఓటును ఓటన్‌ అనే లాటిన్‌ పదం నుంచి సేకరించారు. ఓటు అన్న పదానికి తెలుగులో చాలా అర్థాలు ఉన్నాయి. ఓటు అంటే తెలుగు నిఘంటువు ప్రకారం సమ్మతి తెలపడం, మద్దతు ఇవ్వడం, అంగీకారం, వాగ్దానం, ఎన్నుకోవడం అర్థాలు ఉన్నాయి. ఎన్నికల్లో అభ్యర్థికి పాలనా అధికారాన్ని ఇవ్వడానికి తమ సమ్మతి తెలపడం అనే అర్థం ఉంది.

❑ ఓటు వినియోగం క్రీస్తు పూర్వం 139 నుంచి ఉన్నట్లు తెలుస్తోంది. పురాతన గ్రీస్‌ దేశంలో పగిలిన మట్టి పాత్రల ముక్కలను ఓట్లుగా వినియోగించినట్లుగా ప్రచారంలో ఉంది. ప్రాచీన భారతదేశంలో క్రీస్తు శకం 920లో తమిళనాడులో అరటి ఆకుల ద్వారా ఎన్నికలను నిర్వహించినట్లు ఆధారాలున్నాయి. ఈ పద్ధతిని కూడా వొలూ వ్యవస్థ అన్ని పిలిచే వారు. అమెరికాలో మొదటి సారిగా కాగితపు బ్యాలెట్లతో మూసాచు అనే సెట్స్‌లో ఓ చర్చి పాస్టర్‌ ఎన్నిక కోసం వినియోగించారు. ఆయా దేశాల రాజ్యాంగాలు పాలనాపరంగా ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడం కోసం ప్రజలకు ఓటు హక్కు అనే ఆయుధాన్ని అందిచాయి. 1952 నుంచి మన దేశంలో సార్వత్రిక వయోజన ఓటు హక్కు వినియోగంలోకి వచ్చింది. గతంలో బ్యాలెట్‌ ద్వారా ఓటు వేసేవారు. తర్వాత ఎలక్ట్రానిక్‌ యంత్రాల ద్వారా ఓటు వేస్తున్నా. రాబోయే కాలంలో ఓటు వేసిన తర్వాత రశీదు ఇచ్చే విధానం కూడా అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంటుందని పలువురు అధికారులు అంటున్నారు.


కన్యాకుమారిలో సృష్టి బక్షి పాదయాత్ర మొదలుపెట్టినప్పటి చిత్రం

డాక్యుమెంటరీ


తమిళనాడులోని ఒక బామ్మతో మాట్లాడుతూ...

కలిసి నడిచే గొంతులు

కన్యాకుమారి నుంచి శ్రీ నగర్ వరకూ 260 రోజుల పాటు 3,800 కిలోమీటర్లు దేశమంతా నడిచింది సృష్టి బక్షి. ఎందుకు? స్త్రీలపై జరిగే దురాగతాలపై చైతన్యం కలిగించడానికే కాదు స్త్రీల శక్తియుక్తులను వారికి గుర్తు చేయడానికి. ఆ సుదీర్ఘ ప్రయాణం ఇప్పుడు 'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది. నటి ప్రియాంకా చోప్రా నిర్మాత.

తాను నడిచి చేరుకున్న ఊరిలో ఏదైనా స్కూల్‌లోగాని, పబ్లిక్ హాల్‌లో కాని మహిళలను పోగు చేస్తుంది సృష్టి బక్షి. 'అందరూ కళ్లు మూసుకుని దీర్ఘంగా శ్వాస పీల్చి వదలండి' అంటుంది. 'ఇప్పుడు మీ కళ్ల ఎదురుగా మీ 11 ఏళ్ల వయసున్న మీ రూపాన్ని గుర్తు చేసుకోండి. ఆ 11 ఏళ్ల అమ్మాయిలో ఉండే విశ్వాసం, ఆనందం ఎన్ని విధాలుగా ధ్వంసమైందో గుర్తుకు తెచ్చుకోండి. ఆ అమ్మాయికి సారీ చెప్పండి. ఎందుకంటే ఆ విధ్వంసమంతా మీ అనుమతితోనే జరిగింది' అంటుంది. చాలామంది ఆ మాటలకు ఏడుస్తారు. గడిచివచ్చిన జీవితాన్ని తలుచుకుని బాధలో మునిగిపోతారు. అప్పుడు సృష్టి బక్షి ఒక బోర్డు మీద స్త్రీ శరీర నిర్మాణం గీచి 'ఇదిగో ఈ అవయవాల రీత్యా మీరు మగవారి కంటే భిన్నంగా పుట్టారు. ప్రకృతి ఈ అవయవాలను మీకు ఇస్తే సమాజం అదుపు, ఆంక్షలు, వివక్ష, కుటుంబ హింస, ఆర్థిక బానిసత్వం, ఇంటి పని... ఇన్ని ఇచ్చింది. మనం ఎందుకు మగవారితో సమానం కాము?' అని ప్రశ్నిస్తుంది.

మార్పు కోసం

సృష్టి బక్షిది ముంబై. ఆమె హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుకుంది. హాంగ్‌కాంగ్‌లో మార్కెటింగ్‌లో పెద్ద సంస్థల్లో పని చేసింది. తండ్రి ఆర్మీలో పని చేయడం వల్ల ఆమెకు దేశం పట్ల ఒక ఉద్వేగం ఉండేది. అయితే తాను ప్రేమించే దేశంలో స్త్రీలపై జరిగే అన్యాయాలను చూసి చలించి పోయేది. '2017లో హాంకాంగ్‌లో సిటీ బస్ ఎక్కి ఇంటికి వెళుతున్నప్పుడు నా ఫోన్‌లో ఇండియాలో తల్లీ కూతుళ్లపై తండ్రి ఎదుటే అత్యాచారం చేసి చంపేశారన్న వార్త చదివాను. చాలా నిస్పృహ కలిగింది. నాలాంటి వాళ్లు సౌకర్యంగా పడక్కుర్చీలో కూచుని చింతించడం సరికాదని రంగంలో దిగాలని అనుకున్నాను. అలా నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, ఇండియా వచ్చి దేశంలోని స్త్రీలందరితో మాట్లాడాలని 2018 మే నెలలో పాదయాత్ర ప్రారంభించాను' అని చెప్పింది సృష్టి.

రోజూ వేలాది మంది

'ఉమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో సృష్టి బక్షి మే 2018లో కన్యాకుమారి నుంచి పాదయాత్ర ప్రారంభించింది. ఈ యాత్ర రికార్డు అయ్యేలా టీమ్‌ను ఏర్పాటు చేసుకుంది. 260 రోజుల పాటు దాదాపు 4 వేల కిలోమీటర్ల పాటు సాగే ఈ యాత్రకు కోటి రూపాయలు ఖర్చవుతాయి. 50 లక్షలను క్రౌడ్ ఫండింగ్ ద్వారా పోగు చేసింది.

'ఈ యాత్రలో స్త్రీల కలలు, ఆకాంక్షలు, వారి హక్కులు, సంఘర్షణలు. విజయాలు వినదలుచుకున్నాను. వారు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలుసుకోవాలనుకున్నాను. నా సుదీర్ఘ యాత్రలో మన దేశంలో వరకట్నం ఇంకా పెద్ద సమస్యగా ఉందని అర్థమైంది. వరకట్నం స్త్రీలను మానసికంగా పురుషులతో సమానం అనుకోనివ్వడం లేదు. స్త్రీలను అసభ్యంగా తాకడం, హింసించడం, అణిచి పెట్టడం కొనసాగుతూనే ఉంది. ఒక దశలో నేను యాత్ర చేయలేననుకున్నాను. కాని ఆ మరుసటి రోజు నా మీటింగ్‌కు హాజరైన ఒక ఆశా వర్కర్– ''రాత్రి నన్ను నా భర్త కొట్టాడు. నీ మాటలు విన్నాక ఇక ఇలాంటిది జరగనివ్వకూడదని నిశ్చయించుకున్నాను. నేను నా భర్తను నిలువరించడానికి నలుగురి సాయం తీసుకుంటాను'' అని చెప్పింది. నా యాత్ర వల్ల జరుగుతున్న మేలు అర్థమయ్యాక కొనసాగాను' అని తెలిపింది సృష్టి.

డాక్యుమెంటరీ విడుదల

సృష్టి చేసిన యాత్ర అంతా 'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో డాక్యుమెంటరీగా రూపొందింది. మే 3 నుంచి అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఈ డాక్యుమెంటరీ మీద మంచి రివ్యూలు వస్తున్నాయి. 'ఎందరో స్త్రీలు. వారి జీవితానుభవాలను ఈ డాక్యుమెంటరీలో పంచుకున్నారు. వారు సమస్యలు వారి తెచ్చుకున్నవి కాదు. వారికి తెచ్చిపెట్టినవి. అందుకే నటి ప్రియాంకా చోప్రా నా డాక్యుమెంటరీని చూసి తాను నిర్మాతగా మారి విడుదల చేయడానికి ముందుకు వచ్చారు. ఒక స్త్రీగా, ఆడపిల్ల తల్లిగా ఆమెకు స్త్రీల సాధికారత, ఆత్మగౌరవం గురించి అక్కర ఉంది. జెండర్ ఈక్వాలిటీ గురించి స్త్రీ, పురుషుల్లో చైతన్యం రావడానికి ఈ డాక్యుమెంటరీ ఉపయోగపడుతుందని ఆమె విశ్వసిస్తున్నారు' అని తెలిపింది సృష్టి బక్షి.

కళను రాశి పోస్తోంది!




రాశి అగర్వాల్


ఒక తావు పేపర్ తయారు కావాలంటే పది లీటర్ల నీళ్లు కావాల్సి వస్తుంది. రాసుకోవడానికి ఒక రీము పేపర్ సిద్ధం అవ్వాలంటే పాతికేళ్లు పెరిగిన చెట్టు కొమ్మలను సమూలంగా నరకాలి. చెట్టును నరక్కుండా, నీటిని వృథా చేయకుండా ఒక డైరీ తయారయితే? అంతకంటే ఇంకేం కావాలి? ఇంతే కాదు, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ వృథాను హరాయించుకోవడానికి భూమాత పడే యాతన కూడా తగ్గిపోతుంది. ఇలాంటి వినూత్న ప్రయత్నానికి తెర తీసింది సూరత్‌లో ఓ ఆర్కిటెక్ట్. స్టేషనరీ వస్తువులు, ఇంటీరియర్ డెకరేషన్‌ని కలగలుపుతూ చేసిన ప్రయోగమే రుహానీ రంగ్. ఆ ప్రయోగం వెనుక దాగిన నేపథ్యాన్ని వివరించింది రాశి అగర్వాల్. ఆమె మదిలో వెలిగిన ఈ ఆలోచన తొమ్మిది వేల కిలోల పత్తికి పుస్తక రూపాన్నిచ్చింది.

మనదేశంలో కళ ఉంది!

''నేను ఆర్కిటెక్చర్ ఫైనలియర్‌లో ఉన్నప్పుడు మన సంప్రదాయ నిర్మాణాలు, కళలు, చేతివృత్తుల అధ్యయనం కోసం విస్తృతంగా పర్యటించాను. ఢిల్లీ నుంచి జైపూర్, అహ్మదాబాద్, కచ్, పాండిచ్చేరి నుంచి పూనా వరకు పరిశీలిస్తే మనదేశంలో రకరకాల కళలు, కళా నైపుణ్యాలున్న పని వాళ్లున్నారని తెలిసింది. వాళ్ల చేతుల్లో ఉన్న ప్రతిభను ప్రదర్శించే వేదికలు తగినంతగా లేవు. అలాంటి ఒక వేదికను ఏర్పాటు చేసి, నా వృత్తిలో ఇంటీరియర్ డిజైనింగ్‌కు దోహదం చేసే విధంగా ఒక ప్రయోగం చేశాను. అది విజయవంతమైంది. రకరకాల కళలను ఒక వేదిక మీదకు తీసుకురావాలనే ఉద్దేశంతో 'రుహానీ రంగ్' పేరుతో ఆర్ట్ స్టార్టప్ మొదలు పెట్టాను. ప్లానర్ బుక్ కవర్ పేజీ మీద మధుబని ఆర్ట్ ఉంటే ఇంట్లో అందమైన షో పీస్ ఉన్నట్లే. ప్లానర్ బుక్‌ని కార్నర్ స్టాండ్‌లో అందంగా అమరిస్తే డ్రాయింగ్ రూమ్ కళాత్మకంగా ఉంటుంది. ఇలాంటి ఎన్నో హస్త కళలను పునరుద్ధరించగలుగుతున్నాను.

రుహానీ రంగ్‌ను ఐదు వేల రూపాయలతో మొదలు పెట్టాను. నాతో కలిసి 50 మంది కళాకారులు, 40 మంది ఇతర ఉద్యోగులు పని చేస్తున్నారు. వస్త్రాలను తయారు చేసే భారీ పరిశ్రమలకు పెద్ద సంఖ్యలో పత్తి బేళ్లు వస్తుంటాయి. ప్రతి బేలులోనూ మెషీన్‌లో అమరికకు తగినట్లు ఉపయోగించగా మిగిలిన పత్తి వృథా అవుతూ ఉంటుంది. అది భూమిలో కలిసి పోవాల్సిందే తప్ప మరో పనికి ఉపయోగించేవారు కాదు. ఎందుకూ పనికి రాదని వదిలేస్తున్న ఆ పత్తే నా కుటీర పరిశ్రమకు ముడిసరుకు. నాకు కోవిడ్ సమయం కూడా మంచే చేసింది. ఆ టైమ్‌లో పెద్ద చిన్న పరిశ్రమలన్నీ మూత పడ్డాయి. హస్తకళాకారులు పని లేక ఆర్థికంగా మానసికంగా దెబ్బతిని ఉన్నారు. ఆ సమయంలో నేను ఒక్కొక్కరిని కలిసి నా ఆలోచన చెప్తుంటే వాళ్లు ఉత్సాహంగా నాకు మరికొన్ని ఐడియాలు చెప్తూ తమ అనుభవాన్ని జోడించారు. అలా 2020లో మొదలు పెట్టిన నా కుటీర పరిశ్రమ ఇంత వరకు హ్యాండ్ మేడ్ పేపర్‌తో ప్లానర్స్, క్యాలెండర్‌లు, నోట్‌బుక్స్, జర్నల్స్, స్కెచ్ బుక్స్ వంటి 15 వేల ఉత్పత్తులకు రూపమిచ్చింది. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే నలభై వేల ఫాలోవర్స్‌ను తెచ్చి పెట్టింది. ఆర్ట్ పీస్ కేవలం కళాభిరుచి, కళారాధన కోసమే కాదు. అది మన దైనందిన జీవితంలో భాగంగా మారాలి. అప్పుడే కళ ఎప్పటికీ నిలిచి ఉంటుంది'' అని వివరించింది రాశి అగర్వాల్.





సన్ బర్న్ ముప్పు!

- పండ్ల తోటలు, కూరగాయ తోటలకు ముప్పుగా మారిన ప్రచండమైన ఎండ
- అధిక ఉష్ణోగ్రతలతో పాటు తార స్థాయికి చేరిన లైట్ ఇంటెన్సిటీ, యు.వి. రేడియేషన్
- మామిడి, జామ కాయలు పక్వానికి రాక ముందే ఎర్రగా మారి రాలిపోవటం లేదా నాణ్యత కోల్పోతున్నాయని వాపోతున్న రైతులు
- రోజూ సాయంత్రం నీటిని, వారానికోసారి పోషకాలను చల్లమంటున్న 'ఆంగ్రూ' మాజీ డీన్ డా. పి.వి. రావు

సాగుబడి
కృత్తిక కార్తె : మే 11 నుంచి

ఈ వేసవిలో ఎల్‌నినో పుణ్యాన సాధారణం కన్నా ఐదారు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ ఉద్యాన తోటలు సాగు చేసే రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా సీజనల్ పండ్ల తోటలైన మామిడి, జామతో పాటు కూరగాయలు, డ్రాగన్ వంటి తోటలకు నిప్పుల కుంపటి వంటి వేడి ఒత్తిడి తీవ్ర సమస్యగా మారింది.

47 డిగ్రీలకు చేరిన పగటి గరిష్ట ఉష్ణోగ్రత వల్ల భూమి విపరీతంగా వేడెక్కి రాత్రి 7–8 గంటల వరకు శగలు కక్కుతూ ఉంది. దీన్నే 'రిఫ్లెక్టెడ్ రేడియేషన్' అంటారు. పొలాల్లో కన్నా కాంక్రీటు అరణ్యాలుగా మారిన నగరాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. చెట్లు, మొక్కలు వేర్ల ద్వారా తీసుకునే నీటి కన్నా ఎక్కువగా నీరు ఆవిరైపోతుండటం వల్ల లేత ఆకుల చివర్లు ఎండిపోతున్నాయి. లేత కణాలు ఉంటాయి కాబట్టి లేత ఆకుల చివరలు మాడిపోతున్నాయి.

పగటి గరిష్ట ఉష్ణోగ్రత 25 నుంచి 35 డిగ్రీల సెల్షియస్ వరకు ఉన్న వాతావరణం పంటల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. 40 డిగ్రీలు దాటిన తర్వాత పంటలు, తోటలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇప్పుడు 47–48 డిగ్రీల సెల్షియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉండటంతో కూరగాయ పంటలు, పండ్ల తోటలు సన్ బర్న్‌తో సతమతమవుతూ ఉన్నాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం మాజీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ పీవీ రావు 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

సాధారణంగా ఎండను రక్షణకు కొన్ని పంటలపై 50% సూర్యరశ్మిని ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌ను వాడుతుంటారు. అయితే, ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోవటం వల్ల 80% ఎండను ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌లు వేసుకోవాల్సి వస్తోందని డా. పివి రావు అన్నారు.


సన్‌బర్న్‌కు గురైన మామిడి కాయ


సన్‌బర్న్‌కు గురైన జామ కాయ


సన్‌బర్న్‌కు గురైన డ్రాగన్ పంట

అల్ఫాన్సో, పచ్చడి కాయలు 80% రాలిపోతున్నాయి

ఈ ఏడాది ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా ఉండటం వల్ల అల్ఫాన్సో, దేశీ పచ్చడి రకాల చిన్న కాయలు రాలిపోతున్నాయి. ఆర్గానిక్ మామిడి తోటల్లో గతంలో 10–20% రాలే కాయలు ఈ సీజన్‌లో 70–80% రాలిపోతున్నాయి. ఇతర రకాల్లో కూడా జనవరిలో వచ్చిన ఆఖరి పూత ద్వారా వచ్చిన చిన్న కాయలు ఎక్కువగా ఎండదెబ్బకు రాలిపోతున్నాయి. ఎండలు ముదిరే నాటికి నిమ్మ కాయ సైజు ఉన్న కాయలకు ప్రాబ్లం లేదు. సన్‌బర్న్ సమస్య వల్ల కాయలు ఒకవైపు అకాలంగా రంగు మారిపోతుంటే, వెనుక వైపు మాత్రం పచ్చిగానే ఉంటున్నాయి. బంగినపల్లి పూత రాలిపోవటంతో ఈ ఏడాది 20% కూడా కాయ మిగల్లేదు. దశేరి కాపు మాత్రం అన్నిచోట్లా బాగుంది. మామిడి చెట్లకు రోజూ నీరు స్ప్రే చేస్తున్నాం. చెట్ల కింద మల్చింగ్ చేసి నీటి తేమ ఆరిపోకుండా కాపాడుకుంటున్నాం. ఇదిలా ఉంటే, మధ్యప్రాచ్య దేశాల్లో యుద్ధం వల్ల నౌకల్లో వెళ్లే సరుకు విమానాల ద్వారా ఎగుమతి అవుతోంది. దీనికితోడు, దుబాయ్‌లో భారీ వరదల వల్ల అమెరికా తదితర దేశాలకు మామిడి పండ్ల ఎగుమతి ఈ ఏడాది బాగా దెబ్బతింది. గత 15 రోజుల్లో 350 ఎమిరేట్స్ విమానాలు రద్దయ్యాయి. దీంతో ఖతర్ తదితర దేశాల విమానాలు ధరలు పెంచేశాయి. అమెరికాకు కిలో మామిడి రవాణా చార్జీ రూ. 180 నుంచి 600కు పెరిగిపోయింది. అమెరికాలో 4 కిలోల మామిడి పండ్ల బాక్స్ గతంలో 40 డాలర్లకు అమ్మేవాళం. ఇప్పుడు 60–70 డాలర్లకు అమ్మాల్సివస్తోంది. దీంతో అమెరికాకు మామిడి ఎగుమతులు బాగా తగ్గిపోయాయి.


– **రఫీ** (98480 02221), సేంద్రియ మామిడి రైతు, ఎగుమతిదారు, ఏఆర్4మ్యాంగోస్, హైదరాబాద్



నీరు, పోషకాలు పిచికారీ చేయాలి

విపరీత ఉష్ణోగ్రతలకు తోడైన వడగాడ్పులకు కూరగాయ తోటలు, పండ్ల తోటల్లో లేత ఆకులు మాడిపోతున్నాయి. ఉష్ణోగ్రత, అతినీలలోహిత వికిరణాలతో పాటు సూర్యరశ్మి తీవ్రత చాలా పెరిగిపోయింది. ప్రతి రోజూ సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయటం ద్వారా పంటలకు రక్షించుకోవచ్చు. వారం, పది రోజులకోసారి ఇంటిపంటలపై నానో యూరియా/వర్మీవాష్/జీవామృతం/ఆవు మూత్రంను ఒకటికి పది (1:10) పాళ్లలో నీటిలో కలిపి పిచికారీ చేసుకొని, అతి వేడి వత్తిడి నుంచి తోటలకు ఉపశమనం కలిగించాలి.

– **డాక్టర్ పి.వి. రావు** (94901 92672), రిటైర్డ్ డీన్ ఆఫ్ అగ్రికల్చర్, ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ అధ్యక్షులు, హైదరాబాద్



యు.వి. రేడియేషన్ పండ్లను దెబ్బతీస్తోంది!

అతి నీలలోహిత వికిరణాల (యు.వి. రేడియేషన్) తీవ్రత బాగా పెరిగిపోయి మామిడి, జామ పండ్లు ఎండదెబ్బకు గురవుతున్నాయి. యు.వి. రేడియేషన్ ఏప్రిల్ ఆఖరి, మే మొదటి వారాల్లో తీవ్రస్థాయికి చేరింది. యు.వి. ఇండెక్స్ ఇప్పుడు 12–13కి పెరిగిపోయింది. మామిడి, జామ వంటి పండ్ల తోటల్లో కాయలపై ఎండ మచ్చలు ఏర్పడుతూ పండ్ల నాణ్యతను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. టొమాటోలు వంటి కూరగాయలపై కూడా ఈ ఎండ మచ్చలు సమస్యగా మారాయి. ఎండ తగిలిన వైపు పండినట్లు రంగు మారుతుంది. వెనుకవైపు పచ్చిగానే ఉంటుంది. నాణ్యత కోల్పోయిన ఈ కాయలను కొయ్యలేక, చెట్లకు ఉంచలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధిక వేడికి అనేక పోషకాలు అందక కొన్ని కాయలు రాలిపోతున్నాయి. యు.వి. రేడియేషన్ ఉద్యాన తోటల రైతులను ఈ ఏడాది చాలా నష్టపరుస్తోంది. నత్రజని కోసం ఫిష్ అమినో యాసిడ్ లేదా పంచగవ్యలను ద్రవజీవామృతంతో కలిపి చల్లాలి. బోరాన్ కోసం జిల్లేడు+ఉమ్మెత్త కషాయం, పొటాష్ కోసం అరటి పండ్ల (తొక్కలతో కలిపి తయారు చేసిన) కషాయాన్ని పిచికారీ చేయాలి.

– **ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు** (76598 55588), తెలంగాణా గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం

సూర్యకాంతి తీవ్రత

పంటలపై ప్రతికూల ప్రభావం ఎంతగా ఉందన్నది ఉష్ణోగ్రతతో పాటు సూర్యకాంతి తీవ్రత (లైట్ ఇంటెన్సిటీ)పై కూడా ఆధారపడి ఉంటుందని డా. రావు వివరించారు. సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్న రోజుల్లో చదరపు మీటరుకు 20,000 – 25,000 కిలో లక్స్ వరకు సూర్యకాంతి ఉంటుంది. వేసవిలో సాధారణంగా ఇది 80,000 కిలో లక్స్‌కు పెరుగుతూ ఉంటుంది. అయితే, ఈ ఏడాది ఇది విపరీతంగా పెరిగి, ఏకంగా 1,20,000 కిలో లక్స్‌కు చేరటం పండ్ల తోటలకు, కూరగాయల పంటలకు ముప్పుగా మారిందని డాక్టర్ పి వి రావు తెలిపారు.

ఫొటో ఆక్సిడేషన్ వల్ల ఆకులలో కిరణజన్య సంయోగ క్రియ సజావుగా జరగటం లేదు. లేత ఆకుల్లో క్లోరోఫిల్ మాలిక్యూల్ చిట్లిపోవటం వల్ల ఆకుపచ్చగా ఉండాల్సిన ఆకులు జీవం కోల్పోయి పసుపు రంగుకు మారి ఎండిపోతున్నాయన్నారు.

తారస్థాయికి చేరిన యువి రేడియేషన్

అతినీలలోహిత కిరణాల (యువి) రేడియేషన్ సూచిక సాధారణంగా 3–4 వరకు ఉంటుంది. వేసవిలో ఈ సూచిక 8–9 వరకు పెరుగుతుంది. అయితే, ఈ ఏడాది మాత్రం ఇది 12కు పెరగటంతో సూర్యరశ్మిని పంటలు, తోటలు తట్టుకోలేకుండా ఉన్నాయని డా. పి వి రావు వివరించారు. మామిడి, జామ తదితర కాయలు ఎండ పడిన చోట ఎర్రగా మారి దెబ్బతింటున్నాయి. వెనుక వైపు పచ్చిగానే ఉంటూ ఎండ సోకిన దగ్గర రంగు మారుతుండటంతో పండ్లు నాణ్యతను కోల్పోతున్నాయి. అల్ఫాన్సో, పచ్చడి రకాల మామిడి కాయలు బాగా రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.


టొమాటో పంటకు షేడ్‌నెట్

పోషకాలు, హార్మోన్ అసమతుల్యత

వేసవిలో టొమాటో, మిర్చి వంటి కూరగాయ పంటల మొక్కలు నాటుకునేటప్పుడు వీటికి ఉత్తర, దక్షిణ వైపున నీడనిచ్చే మొక్కలను వేసుకుంటే ఎండ బారి నుంచి కొంత మేరకు కాపాడుకోవచ్చు. ఉదాహరణకు.. టొమాటో మొక్కలు ఉత్తర దక్షిణాల్లో మొక్కజొన్న లేదా ఆముదం మొక్కలు వత్తుకోవాలి. వడగాలుల నుంచి పంటలను రక్షించుకోవటానికి పొలం సరిహద్దుల్లో విండ్ బ్రేకర్‌గా పనికొచ్చే ఎత్తయిన చెట్లు పెంచుకోవాలి. ఈ ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్న వారి తోటలు ఉపశమనం పొందుతాయి.

దాదాపు మరో నెల రోజులు మండే ఎండలు కొనసాగే పరిస్థితి ఉండటంతో తోటలకు చాలినంతగా నీటి తడులు ఇవ్వటంతో పాటు, చెట్లపైన కూడా సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయాలి. వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ నేల నుంచి వేర్ల ద్వారా పోషకాలను తీసుకునే సామర్థ్యం తగ్గుతుందని, అందుకు తగినట్లు నీరు, పోషకాలు సైతం అందిస్తే తోటలకు ఉపశమనం కలుగుతుందని డాక్టర్ పివి రావు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కాలంలో పంటలు పోషకాలను నేల నుంచి తీసుకోవటంలో ఇబ్బంది వస్తుంది. జింక్ లోపం ఏర్పడుతుంది. హార్మోన్లను కూడా చెట్లు, మొక్కలు తయారు చేసుకోలేవు. హార్మోన్ అసమతుల్యత ఏర్పడుతుంది.

ఎండ తీవ్రతకు రెస్పిరేషన్ రేటు ఎక్కువ అవటం వల్ల కిరణజన్య సంయోగ క్రియ ద్వారా తయారయ్యే పిండి పదార్థం మొక్క/చెట్టు నిర్వహణకే సరిపోతాయి. పెరుగుదల లోపిస్తుంది. అదనపు పిండిపదార్థం అందుబాటులో వుండక పూలకు, కాయలకు పోషకాలను అందించలేని సంక్షోభ స్థితి నెలకొంటుంది. అందువల్ల పూలు, కాయలు రాలిపోయే పరిస్థితి ఎదురవుతుంది.

అతి వేడి వత్తిడి ఎదుర్కొంటున్న మామిడి తోటలపై జింక్, ప్లానోఫిక్స్, బోరాన్‌లను సాయంత్రం 3 గంటల తర్వాత పిచికారీ చేయాలి. టొమాటో, మిరప, వంగ తదితర కూరగాయ మొక్కలపైన నాఫ్తలిన్ అసిటిక్ యాసిడ్‌ను 5 లీటర్ల నీటికి 1.5 నుంచి 2 ఎం.ఎల్. మోతాదులో కలిపి పిచికారీ చేయాలని డా. రావు తెలిపారు.

సేంద్రియ సేద్యం, వ్యాపార నైపుణ్యాలపై 6 రోజుల శిక్షణా శిబిరం

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులను సేంద్రియ వ్యవసాయంలో మెళకువలు నేర్పటంతో పాటు.. సేంద్రియ ఆహారోత్పత్తుల వ్యాపార అవకాశాలను సృష్టించటంలో నిపుణులైన ఫెసిలిటేటర్‌గా మారడానికి నైపుణ్యం, విజ్ఞానాభివృద్ధి శిక్షణా కోర్సును నిర్వహించనుంది కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ. 20 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయ శిక్షణలో విశేష కృషి చేస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రామాంజనేయులు సారథ్యంలో నూజివీడుకు సమీపంలోని కొండపర్వలో సకల వసతులతో కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ అంతర్జాతీయ స్థాయి వసతులతో ఇటీవలే ప్రారంభమైంది. సేంద్రియ వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో లోతైన పరిశోధనలు చేయటంతో పాటు సేంద్రియ వ్యవసాయం, వ్యాపారం తదితర అంశాలపై ప్రామాణికమైన శిక్షణ ఇవ్వటమే ఈ అకాడమీ లక్ష్యంగా పెట్టుకుంది. అగ్రికల్చర్ స్కిల్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల తోడ్పాటుతో మే 22 నుంచి 27 వరకు తెలుగులో నిర్వహించనున్న ఉచిత రెసిడెన్షియల్ శిక్షణా శిబిరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డా. రామాంజనేయులు తెలిపారు. గుగుల్ ఫామ్ ద్వారా అభ్యర్థులు విధిగా ముందుగా పేర్లు నమోదు చేసుకోవటం తప్పనిసరి. 30–35 మందికి మాత్రమే అవకాశం.

ఇతర వివరాలకు.. 85002 83300.
www.krishnasudhaacademy.org

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్